సాగర్‌పై యథాతథస్థితి

మొదటిపేజీ తరువాయి...

అంగీకరించాయి. ఈ నెల 29న అర్ధరాత్రి 100 మంది సాయుధ పోలీసులను ఏపీ ప్రభుత్వం అప్రజాస్వామికంగా దింపి నాగార్జునసాగర్ డ్యామ్‌ను అక్రమించింది. 13వ గేట్ వద్ద ముళ్ల కంచె ఏర్పాటు చేసింది. అక్కడ ఉన్న సీసీ కెమెరాలను ధ్వంసం చేసింది. కుడి కాలువ గేట్లను ఎత్తి 5,000 క్యుసెక్కుల నీటిని తరలించుకుపోవడం ప్రారంభించింది. ఏపీ చర్యలను తీవ్రంగా ఆక్షేపించిన తెలంగాణ ప్రభుత్వం వెంటనే విషయాన్ని కేఆర్‌ఎంబీ దృష్టికి తీసుకెళ్లింది. తక్షణమే జోక్యం చేసుకుని దౌర్జన్యపూరితంగా ఏపీ చేపట్టిన నీటి తరలింపును ఆపాలని, డ్యామ్ ఆక్రమణను తొలగించి పూర్వపుస్థితిని పునరుద్ధరించాలని, డ్యామ్ కంట్రోల్‌ను తెలంగాణ ప్రభుత్వానికి అప్పగించాలని బోర్డుకు విజ్ఞప్తి చేసింది. ఈ నేపథ్యంలో బోర్డు చైర్మన్ ఈ విషయాన్ని వెంటనే కేంద్ర జలశక్తిశాఖ దృష్టికి తీసుకెళ్లారు. ఇరు రాష్ట్రాల మధ్య నెలకొన్న వివాదం విషయంలో తదుపరి చేపట్టాల్సిన చర్యలపై మార్గ నిర్దేశనం చేయాలని కేంద్రాన్ని బోర్డు కోరింది. ఈ నేపథ్యంలో కేంద్ర హోం శాఖ కార్యదర్శి అజయ్‌కుమార్ భల్లా.. కేంద్ర జల వనరుల శాఖ కార్యదర్శి, కేంద్ర జల సంఘం, కేఆర్ఎంబీ అధికారులు, తెలంగాణ, ఏపీ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, డీజీపీలతో శుక్రవారం ప్రత్యేకంగా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఏపీది దుస్సాహసం: తెలంగాణ

వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మాట్లాడుతూ.. నవంబర్ 29న రాత్రి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన దాదాపు 500 మంది సాయుధ పోలీసులు నాగార్జునసాగర్ డ్యామ్‌పైకి వచ్చి సీసీ కెమెరాలను ధ్వంసం చేయడంతోపాటు 5, 7 గేట్ల వద్ద ఉన్న హెడ్ రెగ్యులేటర్లను తెరిచి దాదాపు 5 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారని ఆక్షేపించారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నిర్వహణలో ఉండగా ఏపీ ప్రభుత్వ చర్య దుస్సాహసమైనదని, తమ రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్యను సృష్టించిందని తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు. గత రెండేండ్లుగా ఏపీ ప్రభుత్వం ఈ విధమైన అతిక్రమణలకు పాల్పడటం ఇది రెండోసారి అని గుర్తుచేశారు. ఏపీ ప్రభుత్వ చర్య వల్ల హైదరాబాద్ నగరంతోపాటు పరిసర ప్రాంతాల్లోని రెండు కోట్ల మంది ప్రజల తాగునీటి అవసరాలకు తీవ్ర ఆటంకం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. 2014 నుంచి కొనసాగుతున్న మాదిరిగానే స్టేటస్-కోను కొనసాగించాలని కేంద్ర హోంశాఖ కార్యదర్శికి విజ్ఞప్తి చేశారు.



సాగర్ కుడి కాల్వకు కొనసాగుతున్న నీటి విడుదల

బోర్డు పర్యవేక్షణలో సాగర్ డ్యామ్

ఇరు రాష్ట్రాలతో మాట్లాడిన అనంతరం కేంద్ర హోంశాఖ.. ఏపీ, తెలంగాణకు పలు మార్గదర్శకాలను జారీ చేసింది. నాగార్జునసాగర్ డ్యామ్‌పై గతంలో ఉన్న మాదిరిగానే స్టేటస్-కో కొనసాగించాలని ఆదేశించింది. అదేవిధంగా ఈ డ్యామ్ తాత్కాలికంగా కేంద్ర రిజర్వ్ పోలీస్ దళాల పర్యవేక్షణలో ఉంటుందని కేంద్ర హోం శాఖ కార్యదర్శి స్పష్టం చేశారు. ఆపరేషన్ ప్రొటోకాల్ అంశంపై కేంద్ర జలవనరుల శాఖ కార్యదర్శి అధ్వర్యంలో ప్రత్యేక సమావేశాన్ని త్వరలోనే నిర్వహిస్తామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ అంజనీకుమార్, నీటిపారుదలశాఖ కార్యదర్శి స్మితాసబర్వాల్, జీఏడీ కార్యదర్శి శేషాద్రి, హోంశాఖ ముఖ్య కార్యదర్శి జితేందర్, అడిషనల్ డీజీ ఎస్‌కే జైన్, ఐజీ షానవాజ్‌కాశీం, నీటిపారుదల శాఖ సలహాదారు మురళీధర్, ఓఎస్డీ శ్రీధర్ దేశ్‌పాండే తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా వీడియోకాన్ఫరెన్స్‌లో తీసుకున్న నిర్ణయం మేరకు డ్యామ్ పర్యవేక్షణకు కేంద్ర హోంశాఖ రెండు ప్లాటూన్ల సీఆర్పీఎఫ్ బలగాలను తరలించింది.

ఇరిగేషన్ అధికారుల చర్చలు

నాగార్జునసాగర్ డ్యామ్‌పైకి అక్రమంగా ప్రవేశించి, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఏపీ అధికారులతో తెలంగాణ ఇరిగేషన్ అధికారులు శుక్రవారం చర్చలు జరిపారు. శుక్రవారం ఉదయం ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ హరిరామ్, సీఈలు హమీద్‌ఖాన్, ధర్మానాయక్, రమేశ్‌బాబు డ్యామ్ వద్దకు చేరుకొని అక్కడి పరిస్థితులను పరిశీలించి ఏపీ అధికారులతో చర్చించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సమయంలో శ్రీశైలం డ్యామ్ నిర్వాహణను ఏపీ ప్రభుత్వం, నాగార్జునసాగర్ డ్యామ్ నిర్వాహణను తెలంగాణ ప్రభుత్వం చేపట్టాలని నిర్ణయించిన విషయాన్ని తెలంగాణ అధికారులు గుర్తుచేశారు. కేఆర్ఎంబీ సూచనల ప్రకారం ఏపీకి రావలసిన నీటిని విడుదల చేస్తున్నామని, అక్టోబర్‌లో 5 టీఎంసీల నీటికి బదులు 5.10 టీఎంసీలను విడుదల చేశామని, జనవరిలో మరో 5 టీఎంసీలు విడుదల చేయాల్సి ఉన్నదని తెలిపారు. నవంబర్‌లో కుడి కాల్వకు నీటి విడుదలపై ఏపీ అధికారుల నుంచి ఇండెంట్ లేదని, కావాలనే డ్యామ్‌పై ఉద్రిక్త వాతావరణం నెలకొల్పి నీటిని విడుదల చేసుకున్నారని చెప్పారు.

ఏపీ అధికారులు, పోలీసులపై కేసులు నమోదు

నాగార్జునసాగర్ డ్యామ్‌పై ఉద్రిక్త వాతావరణం సృష్టించి, డ్యామ్ పోలీస్ సిబ్బందిపై దాడి చేసి, సీసీ కెమెరాలు, ఫోన్లను ధ్వంసం చేసిన ఏపీ అధికారులు, పోలీసులపై తెలంగాణలోని నందికొండ పైలాన్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో తెలంగాణ డ్యామ్ ఇరిగేషన్ అధికారులు కేసులు పెట్టారు.

వెంటనే నీటి విడుదలను నిలిపేయండి: ఏపీకి కేఆర్ఎంబీ ఆదేశం

సాగర్ కుడికాల్వ నుంచి నీటి విడుదలను వెంటనే నిలిపివేయాలని ఏపీ ప్రభుత్వాన్ని కేఆర్ఎంబీ ఆదేశించింది. ఈ మేరకు ఏపీ జలవనరులశాఖ కార్యదర్శికి కేఆర్ఎంబీ లేఖ రాసింది. గతంలో త్రిసభ్య కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు నాగార్జునసాగర్ జలాశయం నుంచి 15 టీఎంసీల నీటిని ఆంధ్రప్రదేశ్‌కు విడుదల చేయాలని నిర్ణయించామని తెలిపింది. ఈ ఏడాది అక్టోబర్ 10 నుంచి 20వ తేదీ మధ్య 5 టీఎంసీలను విడుదల చేశామని పేర్కొన్నది. రానున్న జనవరి 8 నుంచి 18 వరకు మరో 5 టీఎంసీలు, ఏప్రిల్ 8 నుంచి18వ తేదీ వరకు మూడో విడతగా 5 టీఎంసీలను విడుదల చేయాల్సి ఉన్నదని వెల్లడించింది. అయితే నవంబర్, డిసెంబర్‌లో నీటి విడుదల కోసం ఏపీ నుంచి కేఆర్ఎంబీ ఎలాంటి ఇండెంట్‌ను అందుకోలేదని ఆ లేఖలో స్పష్టంచేసింది. ఈ నేపథ్యంలో కుడి కాలువ నుంచి నీటి విడుదలను వెంటనే నిలిపివేయాలని ఏపీని ఆదేశించింది. అయితే ఆంధ్ర ప్రభుత్వం ఆ ఆదేశాలను పట్టించుకోకుండా నీటి విడుదలను కొనసాగిస్తున్నది.

డ్యామ్‌పై రెండో రోజూ హైటెన్షన్

నాగార్జునసాగర్ డ్యామ్‌పై గురువారం రాత్రి ప్రారంభమైన ఉద్రిక్త పరిస్థితులు శుక్రవారం కూడా కొనసాగాయి. ఏపీ అధికారులు పోలీస్ బలగాలతో గురువారం తెల్లవారుజామున డ్యామ్ గేట్లను పాడుచేశారు. డ్యామ్‌పై విధులు నిర్వహిస్తున్న తెలంగాణ ఎస్పీఎఫ్ పోలీసులపై దాడి చేసి ఫోన్లు, సీసీ కెమెరాలను ధ్వంసం చేసి డ్యామ్‌పైకి ప్రవేశించారు. డ్యామ్ 13వ గేటు వరకు తమదని పేర్కొంటూ అక్కడ ముళ్ల కంచె, బారికేడ్లు ఏర్పాటు చేసి డ్యామ్ పై ఉన్న రోడ్డును మూసివేశారు. అవతల ఏపీ పోలీసులు పహారా కాస్తూ 13వ గేటు అవతల ఉన్న కంట్రోల్ రూమ్‌కు తెలంగాణ అధికారులను, పోలీసులను పోకుండా అడ్డుకున్నారు. డ్యామ్ సగ భాగం తమదేనంటూ గురువారం బలవంతంగా కుడి కాల్వ గేట్లను తెరిచి 5 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. ఆంధ్ర అధికారులు, పోలీస్ బలగాలు నాగార్జునసాగర్ డ్యామ్‌పై ఉద్రిక్తత వాతావరణం సృష్టించడంతో పరిస్థితులను చక్కదిద్దడానికి తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక, సివిల్, ఏఆర్, బెటాలియన్లతో పోలీస్ బలగాలను తెలంగాణ వైపు ఉన్న డ్యామ్ వద్ద మోహరించింది. వెయ్యి మంది పోలీసులు తెలంగాణ వైపు ఉన్న డ్యామ్ వద్ద పహారా కాస్తున్నారు.

మాంసం ముక్కు ఢోకా లేదు!

మాంసం లభ్యతలో తెలంగాణ నంబర్ వన్

- గుడ్ల లభ్యత, ఉత్పత్తిలోనూ..
- పశుపోషణ గణాంకాల వార్షిక నివేదికలో వెల్లడి

హైదరాబాద్, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న గొర్రెల పంపిణీ పథకం అద్భుతాలు సృష్టిస్తున్నది. ఒకప్పుడు రోజుకు ఆరేడు వందల లారీల గొర్రెలను దిగుమతి చేసుకున్న తెలంగాణ.. ఇప్పుడు మాంసం లభ్యతలో దేశంలోనే నంబర్‌వన్ స్థానానికి ఎదిగింది. కేసీఆర్ 2017లో ప్రారంభించిన ఈ పథకం గొల్ల, కురుమల కులవృత్తికి పూర్వవైభవంతో పాటు వారిని ఆర్థికంగా నిలబెడుతున్నది. రాష్ట్రానికీ ఆర్థిక దన్నుగా నిలుస్తున్నది. కేంద్ర పశుసంవర్ధక, మత్స్య, పాడిపరిశ్రమాభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో ప్రాథమిక పశుపోషణ గణాంకాల (బేసిక్ యానిమల్ హస్బెండరీ స్టాటిస్టిక్స్) వెల్లడించిన వార్షిక నివేదిక-2023 ప్రకారం దేశంలో మాంసం లభ్యతలో తెలంగాణ నంబర్‌వన్ స్థానంలో నిలిచింది. తెలంగాణలో నాలుగేండ్లుగా అమలుచేస్తున్న గొర్రెల పంపిణీ పథకంతో మాంసం ఉత్పత్తి, లభ్యత పెరిగాయి. ఈ పథకం కింద ఇప్పటి వరకు 1.28 కోట్ల గొర్రెల పంపిణీ జరిగింది. పౌల్ట్రీరంగం కూడా 1,500 కోళ్లఫారాలతో పురోగమిస్తున్నది. మాంసం లభ్యతలో తెలంగాణ అగ్రస్థానంలో, మాంసం ఉత్పత్తిలో ఐదో స్థానంలో ఉన్నదని నివేదిక తెలిపింది. కోడిగుడ్ల తలసరి లభ్యతలో 2వ, ఉత్పత్తిలో 3వ స్థానంలో ఉన్నట్టు వెల్లడించింది. పాల ఉత్పత్తి, లభ్యతలో 13వ స్థానంలో ఉన్నట్టు వివరించింది.

నివేదికలోని ముఖ్యాంశాలు

- దేశంలో ప్రతి వ్యక్తికి సరాసరి సంవత్సరానికి 7.10 కిలోల మాంసం లభ్యమవుతున్నది. తెలంగాణలో అత్యధికంగా 28.51 కిలోలు లభిస్తున్నది. ఉత్పత్తిపరంగా దేశంలో ఏటా 9.77 మిలియన్ టన్నులు, రాష్ట్రంలో 108 టన్నులు(11.06%)గా ఉన్నది.
- కోడిగుడ్లు దేశంలో ఏటా తలసరి 101 లభ్యమవుతుండగా, రాష్ట్రంలో 466 లభిస్తున్నాయి. దేశంలో 138.38 బిలియన్లు, రాష్ట్రంలో 17.67 బిలియన్లు (12.77%) ఉత్పత్తవుతున్నాయి.
- పాల ఉత్పత్తులు దేశంలో ప్రతి వ్యక్తికి ఏటా 459 గ్రాములు లభిస్తుండగా, తెలంగాణలో 423 గ్రాములు లభిస్తున్నాయి. దేశంలో 230.68 మిలియన్ టన్నులు, 5.86 మిలియన్ టన్నులు (2.54%) ఉత్పత్తవుతున్నాయి.

నేడు కేంద్ర జల్ శక్తి శాఖ సమావేశం

హైదరాబాద్, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ): నాగార్జునసాగర్ డ్యామ్‌ను ఏపీ దురాక్రమించిన ఉదంతంపై కేంద్ర జల్‌శక్తిశాఖ శనివారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించనున్నది. ఈ మేరకు ఇరు రాష్ట్రాలకు శుక్రవారం కేంద్రం సమాచారం అందించింది. కేంద్ర జల్‌శక్తి చైర్మన్ నేతృత్వంలో హైబ్రిడ్‌మోడ్‌లో ఈ సమావేశం కొనసాగనున్నది. కృష్ణా జలాల పంపిణీ, నాగార్జునసాగర్, శ్రీశైలం డ్యామ్‌ల నిర్వహణ బాధ్యతలను కేఆర్ఎంబీ బోర్డుకు అప్పగించడం తదితర అంశాలపై చర్చించనున్నది.

సాగర్ వద్ద ఏపీ చర్య అప్రజాస్వామికం

- తెలంగాణ విశ్రాంత ఇంజినీర్ల సంఘం

హైదరాబాద్, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ): సాయుధ బలగాలతో నాగార్జునసాగర్ డ్యామ్‌ను ఏపీ ప్రభుత్వం ఆక్రమించడం అప్రజాస్వామిక చర్య అని తెలంగాణ విశ్రాంత ఇంజినీర్ల సంఘం మండిపడింది. ఈ మేరకు సంఘం అధ్యక్షుడు మేరెడ్డి శ్యాంప్రసాద్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి తన్నీరు వెంకటేశం శుక్రవారం ఒక ప్రకటనలో ఏపీ చర్యను తీవ్రంగా ఖండించారు. పునర్విభజన చట్టాన్ని ఏపీ ఉల్లంఘించిందని విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వ యంత్రాంగం, పోలీసులు ఎన్నికల పనిలో నిమగ్నమై ఉండగా, అర్ధరాత్రి దౌర్జన్యంగా, అక్రమంగా నీటిని తరలించడం హేయమైన చర్యగా పేర్కొన్నారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం, కేఆర్ఎంబీ చొరవ తీసుకొని నాగార్జునసాగర్ డ్యాం మీద మోహరించి ఉన్న పోలీసు బలగాలను వెంటనే ఉపసంహరించుకునేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంపై వత్తిడి తెచ్చి సమస్యను పరిష్కరించాలని, ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

జీఎస్టీ వసూళ్లు రూ.1.68 లక్షల కోట్లు

న్యూఢిల్లీ, డిసెంబర్ 1: జీఎస్టీ వసూళ్లు క్రమంగా పెరుగుతున్నాయి. గత నెలకుగాను రూ.1.68 లక్షల కోట్ల పన్ను వసూలైనట్టు ఆర్థిక మంత్రిత్వ శాఖ తాజాగా వెల్లడించింది. ఏడాది క్రితం ఇదే నెలలో వసూలైన రూ1.45 లక్షల కోట్ల కంటే ఇది 15 శాతం అధికం. నవంబర్ నెలలో వసూలైన రూ.1,67,929 కోట్లలో సీజీఎస్టీ కింద రూ.30,420 కోట్లు వసూలు కాగా, ఎస్‌జీఎస్టీ కింద రూ.38,226 కోట్లు, ఐజీఎస్టీ కింద రూ.87,009 కోట్లు వసూలైనట్లు పేర్కొంది. అలాగే సెస్ రూపంలో రూ.12,274 కోట్లు వచ్చాయి. కానీ, అక్టోబర్ నెలలో వసూలైన రూ.1.72 లక్షల కోట్ల కంటే తక్కువగా నమోదయ్యాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు మొత్తంగా రూ.13,32,440 కోట్లు వసూలయ్యాయి.

తెలంగాణలో 4,986 కోట్లు

తెలంగాణ రాష్ట్రంలో జీఎస్టీ వసూళ్లు అంతకంతకు పెరుగుతున్నాయి. ఇప్పటికే రికార్డు స్థాయిలో వసూలవుతుండగా, తాజాగా గత నెలలో రూ.4,986 కోట్ల వసూళ్లు అయ్యాయి. ఏడాది క్రితం ఇదే నెలలో వసూలైన రూ.4,228 కోట్లతో పోలిస్తే ఇది 18 శాతం అధికం. ఏపీలో రూ.4,093 కోట్లు వసూలయ్యాయి.

రూ.624 కోట్లు కట్టాలి

- సత్యం కేసులో సెబీ తాజా ఆదేశాలు
- రామలింగ రాజు, మరో ఐదుగురికి నోటీసులు

న్యూఢిల్లీ, డిసెంబర్ 1: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సత్యం కంప్యూటర్ సర్వీసెస్ కుంభకోణం కేసులో మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ.. తాజా ఆదేశాలు జారీ చేసింది. మునుపటి ఆ కంపెనీ వ్యవస్థాపకుడు రామలింగ రాజుతోపాటు మరో నలుగుర్ని, ఓ సంస్థను రూ.624.09 కోట్లు చెల్లించాలంటూ ఆదేశించింది. అంతేగాక 2009 జనవరి 7 నుంచి ఇప్పటిదాకా 12 శాతం వార్షిక వడ్డీతో ఈ మొత్తాన్ని ఇవ్వాలంటూ గురువారం జారీ చేసిన 96పేజీల ఆర్డర్‌లో బీ రామలింగ రాజు, బీ రామరాజు, బీ సూర్యనారాయణ రాజు, వీ శ్రీనివాస్, జీ రామకృష్ణలతోపాటు ఎస్ఆర్ఎస్ఆర్ హోల్డింగ్స్ కంపెనీకి సెబీ స్పష్టం చేసింది. 2018 అక్టోబర్, నవంబర్‌లో 12 శాతం వార్షిక వడ్డీతో రూ.840.15 కోట్లు చెల్లించాలని సెబీ ఇచ్చిన ఆదేశాలను రామలింగ రాజుసహా ఆరుగురు సవాల్ చేశారు. దీంతో ఈ ఏడాది ఫిబ్రవరిలో శాట్.. మళ్లీ లెక్కించి తాజా ఆదేశాలివ్వాలంటూ సెబీని ఆదేశించింది. ఈ నేపథ్యంలోనే సెబీ కొత్త ఆర్డర్ ఇచ్చింది. అలాగే 45 రోజుల్లోగా చెల్లించాలన్నది. దీంతో ఈ కేసులో చెల్లించాల్సిన మొత్తం దాదాపు రూ.1,747.5 కోట్లకు చేరింది. ఇందులో రూ.1,123 కోట్లు వడ్డీనే కావడం గమనార్హం. 2009 జనవరి 7న ఈ స్కాం వెలుగులోకి వచ్చింది. అకౌంట్స్‌లో భారీ అవకతవకలున్నాయి.

పెరిగిన ఫారెక్స్ నిల్వలు

ముంబై, డిసెంబర్ 1: దేశంలోని డాలర్ నిల్వలు గత నెల 24తో ముగిసిన వారంలో పెద్ద ఎత్తున పెరిగాయి. 2.538 బిలియన్ డాలర్లు ఎగిసి భారతీయ ఫారెక్స్ రిజర్వులు 597.935 బిలియన్ డాలర్లకు చేరినట్టు శుక్రవారం ఆర్బీఐ తెలియజేసింది. అంతకుముందు వారంలో ఏకంగా 5.077 బిలియన్ డాలర్లు పెరిగాయి. కాగా, మొత్తం ఫారెక్స్ రిజర్వుల్లో ఫారిన్ కరెన్సీ ఆస్తులు నవంబర్ 24 నాటికి 528.531 బిలియన్ డాలర్లుగా ఉన్నట్టు ఆర్బీఐ స్పష్టం చేసింది. అలాగే బంగారం నిల్వలు 296 మిలియన్ డాలర్లు ఎగిసి 46.338 బిలియన్ డాలర్లకు చేరాయి. 2021 అక్టోబర్‌లో దేశీయ ఫారెక్స్ నిల్వలు ఆల్‌టైమ్ హై రికార్డును సృష్టిస్తూ 645 బిలియన్ డాలర్లను తాకిన విషయం తెలిసిందే.

ఆల్‌టైమ్ హైకి నిఫ్టీ

తొలిసారి 20,268 వద్ద ముగిసిన సూచీ • ఒకానొక దశలో 20,292 స్థాయికి

11 వారాల గరిష్ఠాన్ని తాకుతూ 67,482 పాయింట్లకు సెన్సెక్స్

ముంబై, డిసెంబర్ 1: దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం ఆకర్షణీయ ప్రదర్శననే కనబర్చాయి. వరుసగా నాలుగోరోజూ వృద్ధిపథంలో నడిచాయి. ఈ క్రమంలోనే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ ఆల్‌టైమ్ హైవద్ద నిలిచింది. 134.75 పాయింట్లు లేదా 0.67 శాతం ఎగిసి మునుపెన్నడూ లేని విధంగా 20,267.90 వద్ద ముగిసింది. ఒకానొక దశలో 158.4 పాయింట్లు లేదా 0.78 శాతం ఎగబాకి సరికొత్త ఇంట్రా-డే రికార్డును నెలకొల్పుతూ 20,291.55 స్థాయిని తాకింది. మరోవైపు బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 11 వారాల గరిష్ఠాన్ని చూపుతూ 492.75 పాయింట్లు లేదా 0.74 శాతం పుంజుకొని 67,481.19 వద్ద స్థిరపడింది. ఈ ఏడాది సెప్టెంబర్ 18 తర్వాత సెన్సెక్స్ మళ్లీ ఈ స్థాయికి చేరుకోవడం ఇదే. ఇక ఇంట్రా-డేలోనైతే 575.89 పాయింట్లు లేదా 0.85 శాతం పెరిగి 67,564.33 స్థాయికి వెళ్లింది.

రంగాలవారీగా..

మదుపరులు ఉదయం ఆరంభం నుంచే కొనుగోళ్లకు పెద్దపీట వేశారు. ఈ క్రమంలో విద్యుత్తు రంగ షేర్లు అత్యధికంగా 1.57 శాతం లాభపడ్డాయి. ఆ తర్వాత ఎఫ్ఎంసీజీ (1.53 శాతం), యుటిలిటీస్ (1.46 శాతం), రియల్టీ (1.32 శాతం), మెటల్ (1.07 శాతం), కమోడిటీస్ (0.92 శాతం), ఇండస్ట్రియల్స్ (0.88) షేర్లు పెరిగాయి. ఐటీసీ, ఎన్టీపీసీ, యాక్సిస్ బ్యాంక్, ఎల్‌అండ్‌టీ, బజాజ్ ఫైనాన్స్, ఏషియన్ పెయింట్స్, టాటా స్టీల్ షేర్లు పెద్ద ఎత్తున పుంజుకున్నాయి. బీఎస్ఈ మిడ్ క్యాప్ సూచీ 0.96 శాతం, స్మాల్ క్యాప్ సూచీ 0.48 శాతం మేర వృద్ధి చెందాయి.

గ్లోబల్ మార్కెట్లలో..

అంతర్జాతీయ మార్కెట్ల విషయానికొస్తే.. ఆసియా మార్కెట్లలో కీలకమైన చైనా సూచీ లాభాల్లో ముగిసింది. అయితే దక్షిణ కొరియా, జపాన్, హాంకాంగ్ సూచీలు నష్టపోయాయి. ఐరోపా దేశాల్లో మాత్రం జర్మనీ, బ్రిటన్, ఫ్రాన్స్ సూచీలు లాభాల్లో కదలాడాయి. అమెరికా మార్కెట్లూ చాలావరకు లాభాల్లోనే ట్రేడ్ అయ్యాయి. ఇక విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్ఐఐ) గురువారం దేశీయ స్టాక్ మార్కెట్లలోకి రూ.8,147.85 కోట్ల పెట్టుబడులను తీసుకొచ్చారని శుక్రవారం ఆయా స్టాక్ ఎక్స్ఛేంజీలు తెలిపాయి. కాగా, ఈ వారం మొత్తంగా సెన్సెక్స్ 1,511.15 పాయింట్లు లేదా 2.29 శాతం పెరగగా, నిఫ్టీ 473.2 పాయింట్లు లేదా 2.39 శాతం పెరిగింది.

స్టాక్ మార్కెట్ల వృద్ధికి ప్రధాన కారణాలు

- ఆకర్షణీయ స్థూల ఆర్థిక గణాంకాలు
- కొనుగోళ్ల జోష్‌లో మదుపరులు
- విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు
- ఆకట్టుకున్న పవర్, ఎఫ్ఎంసీజీ, రియల్టీ రంగాల షేర్లు
- అమెరికా, ఐరోపా మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు

వాణిజ్య

పెరిగిన ఎన్ఎండీసీ ఉత్పత్తి

హైదరాబాద్, డిసెంబర్ 1: ఖనిజ ఉత్పత్తిలో అగ్రగామి సంస్థయైన ఎన్ఎండీసీ ఆశాజనక పనితీరు కనబరిచింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి నవంబర్ మధ్యకాలంలో సంస్థ 27.31 మిలియన్ టన్నుల ఖనిజాన్ని ఉత్పత్తి చేసింది. ఏడాది క్రితం ఇదే సమయంలో ఉత్పత్తి చేసిన 23.32 మిలియన్ టన్నులతో పోలిస్తే ఇది 17 శాతం అధికం. ఇదే సమయంలో సంస్థ విక్రయాలు 22.49 మిలియన్ టన్నుల నుంచి 27.78 మిలియన్ టన్నులకు చేరుకున్నాయి. మరోవైపు, గత నెలలో సంస్థ 3.83 మిలియన్ టన్నుల ఖనిజాన్ని ఉత్పత్తి చేయగా, 3.79 మిలియన్ టన్నులను విక్రయించింది. దేశవ్యాప్తంగా ఉత్పత్తి అవుతున్న ఖనిజంలో సంస్థ 20 శాతం ఉత్పత్తి చేస్తుండటం విశేషం.

ఎన్‌సీసీకి 533 కోట్ల ఆర్డర్

హైదరాబాద్, డిసెంబర్ 1: రాష్ట్రానికి చెందిన ప్రముఖ మౌలిక సదుపాయాల సంస్థ ఎన్‌సీసీ..గత నెలలో రూ.553. 48 కోట్ల విలువైన రెండు నూతన ప్రాజెక్టులను దక్కించుకున్నట్టు తెలిపింది. ఈ ఆర్డర్లు బిల్డింగ్ డివిజన్ నుంచి వచ్చాయని పేర్కొంది. ప్రత్యేకంగా నిర్మాణాలు, జాతీయ రహదారులు, రియల్టీ, ఇతర వ్యాపారాలు నిర్వహించడానికి నాగార్జున కన్‌స్ట్రక్షన్ ఈ కంపెనీని ప్రారంభించింది.

డిపాజిట్లపై బీవోఐ వడ్డీ పెంపు

ముంబై, డిసెంబర్ 1: డిపాజిట్‌దారులకు శుభవార్తను అందించింది ప్రభుత్వ రంగ సంస్థ బ్యాంక్ ఆఫ్ ఇండియా(బీవోఐ). ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీరేట్లను పెంచుతున్నట్లు తాజాగా శుక్రవారం ప్రకటించింది సంస్థ. 46 రోజుల నుంచి ఏడాది లోపు కలిగిన రూ.2 కోట్ల నుంచి రూ.10 కోట్ల లోపు కలిగిన ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీని స్వల్పంగా పెంచింది. దీంతో 46 రోజుల నుంచి 90 రోజుల్లోపు డిపాజిట్లపై వడ్డీని 5.25 శాతానికి సవరించిన బ్యాంక్..91 రోజుల నుంచి 179 రోజుల కాలపరిమితిపై 6 శాతం వడ్డీని, 180-210 రోజుల కాలపరిమితి కలిగిన డిపాజిట్లపై వడ్డీని 6.25 శాతానికి, 211-ఏడాది లోపు డిపాజిట్లపై వడ్డీని 6.50 శాతానికి సవరించింది. అలాగే ఏడాది కాలపరిమితి కలిగిన డిపాజిట్లపై వడ్డీని 7.25 శాతంగా నిర్ణయించింది. గత నెలలో బ్యాంక్ రూ.2 కోట్ల లోపు డిపాజిట్లపై వడ్డీని పెంచిన విషయం తెలిసిందే.

వెనక్కిరాని 2 వేల నోట్లు రూ.9,760 కోట్లు

ముంబై, డిసెంబర్ 1: చలామణి నుంచి దాదాపు 97.26 శాతం రూ.2వేల నోట్లు తిరిగి బ్యాంకింగ్ వ్యవస్థలోకి వచ్చాయని ఆర్బీఐ శుక్రవారం తెలియజేసింది. ఇంకా రూ.9,760 కోట్ల విలువైన రూ.2వేల నోట్లు ప్రజల వద్దే ఉన్నాయని, అవి రావాల్సి ఉందని స్పష్టం చేసింది. ఈ ఏడాది మే 19న చలామణి నుంచి రూ.2వేల నోట్లను ఆర్బీఐ అనూహ్యంగా ఉపసంహరించుకున్న విషయం తెలిసిందే. అయితే నాడు రూ.3.56 లక్షల కోట్ల విలువైన రూ.2వేల నోట్లు చలామణిలో ఉన్నాయని, నవంబర్ 30 నాటికి ఇందులో రూ.3.46 లక్షల కోట్లు తిరిగి వచ్చేశాయని ఆర్బీఐ ఈ సందర్భంగా ఓ ప్రకటనలో వెల్లడించింది. కాగా, అక్టోబర్ 8 నుంచి హైదరాబాద్‌సహా 19 ఆర్బీఐ ఆఫీసుల్లోనే రూ.2వేల నోట్ల డిపాజిట్ లేదా మార్చుకునే వీలు కల్పించారు.

వాహన విక్రయాలకు పండుగ జోష్

నవంబర్ నెలలో అమ్ముడైన వాహన వివరాలు

కంపెనీ	2023	2022	వృద్ధి (%లో)
మారుతి	1,64,439	1,59,044	3.39
టాటా మోటర్స్	74,172	72,647	1.73
మహీంద్రా	70,576	58,303	21
హ్యుందాయ్	65,801	64,003	3
టయోటా కిర్లోస్కర్	17,818	11,765	51
హోండా కార్స్	8,730	7,051	24
ఎంజీ మోటర్స్	4,154	4,079	2
ద్విచక్ర వాహన సంస్థలు			
బజాజ్ ఆటో	4,03,003	3,06,719	31
టీవీఎస్ మోటర్	3,64,230	2,77,123	31
హోండా మోటర్‌సైకిల్	4,47,849	3,73,234	20
రాయల్ ఎన్‌ఫీల్డ్	80,251	70,766	13

న్యూఢ